క్లుప్తంగా

మావుళ్లమ్మ సేవలో కలెక్టర్


కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ నగేష్

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ వారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కలెక్టర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ మహలక్ష్మీ నగేష్, ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ కలెక్టర్ అమ్మవారి శేషవస్త్రాన్ని, అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలు అందజేశారు. వేద పండితులు మంత్రోచ్ఛరణాల మధ్య ఆశీర్వచనాలను అందజేశారు. అలాగే పంచారామ క్షేత్రంలో శ్రీ ఉమాసోమేశ్వర స్వామి వారిని కలెక్టర్ నాగరాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట జిల్లా దేవదాయ శాఖ అధికారి ఐవీ సుబ్బారావు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డి.కృష్ణరాజు రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి.వెంకటరామిరెడ్డి దంపతులు కూడా గురువారం మావుళ్లమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ నగేష్ అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

అన్ని రంగాల్లో ఉపాధి కోల్పోతున్న ప్రజలు

భీమవరం: వ్యవసాయధారితమైన జిల్లాలో పౌల్ట్రీ, ఆక్వా, వరి, రైస్ మిల్లింగ్ పరిశ్రమలు కుదేలై వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మౌలిక వసతులు హరించుకుపోతున్నా పాలకులు దృష్టి పెట్టకపోవడం దారుణమన్నారు. ఈ నెల 22, 23వ తేదీల్లో ఉండిలో 32 గంటలపాటు సీపీఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలకు చేపట్టనున్నట్లు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

యువత గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

పాలకోడేరు: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పాలకోడేరు మండలం కుమదవల్లి వీరేశలింగం కవి సమాజ పబ్లిక్ ప్రవేట్ గ్రంథాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించారు. గ్రంథాలయం పరిసరాలను పరిశీలించి గ్రంథాలను, పుస్తకాలను పరిశీలించారు. జేసీ వెంట తహసీల్దార్ ఎన్‌డీ విజయలక్ష్మీ, ఎంపీడీఓ ఎంతఃరెడ్డి, లైబ్రరీ నిర్వాహకులు భూపతి రాజు నాగేంద్రవర్మ, వీఆర్‌ఓ కె.సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

శశికళకు డాక్టరేట్ ప్రదానం


శశికళను సత్కరిస్తున్నదృశ్యం

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శశికళకు సివిల్ ఇంజినీరింగ్‌లో ఆంధ్రాయూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. డాక్టరేట్ పొందిన శశికళను గురువారం యాజమాన్యం తరపున సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ సత్కరించారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్ట్రత్ అండ్ ఎలాస్టిక్ ప్రాపర్టీస్ ఆఫ్ హైపో స్లగ్డ్ అండ్ కాపర్ కోటెడ్ మైక్రో స్టీల్ ఫైబర్ రేయిన్ ఫోర్స్‌డ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ విత్ డిఫరెంట్ సిమెంట్స్ అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు గాను ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, సివిల్ ఇంజినీరింగ్ హెడ్స్ జి.శ్రీ బాల, ఏసీ ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జా చేయలేదు

పాలకోడేరు: మండలంలోని గరగపర్రు దళితులు ఆరోపిస్తున్నట్లు తాను భూ కబ్జా చేయలేదని ఎంపీటీసీ సభ్యుడు షేక్ పాపా సాహెబ్ (శంకరం)అన్నారు. గురువారం గరగపర్రు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తనపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. 384/2 సుమారు 4.58 ఎకరాల స్మశాన భూమి ఉంది అయితే ఈ స్మశాన వాటిక ఏ ఒక్క కులానిది కాదని గ్రామాన్ని అంతటికి చెందినదని పేర్కొన్నారు. మసీదు సమీపంలో ఉన్న రోడ్డు వైపు స్థలం సంఘానికే కొన్నామని కానీ తమ వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు . ఈ స్థలంలో ఆడవాళ్లు నమాజ్ చేసుకుంటున్నారని వివరించారు. ఆర్ అండ్‌బీ స్థలమైతే నిరూపించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్లా, షేక్ హుస్సేన్, సిద్దా సాహెబ్ మూలా సాహెబ్ పాల్గొన్నారు.

ఆక్రమణల కోరల్లో రాయలం డ్రైయిన్

- రూ. కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- డ్రైయిన్‌కు ఇరువైపులా ఆక్రమించి యథేచ్ఛగా పక్కా కట్టడాలు


క్లోజ్‌డ్ డ్రెయిన్‌కు ఇరువైపులా ఆక్రమణలు


డ్రైయిన్‌ను ఆక్రమించిన దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం మీదుగా ప్రవహించే రాయలం డ్రెయిన్ ఏళ్ల తరబడి ఆక్రమణదారులు చెరలో మగ్గుతోంది. ఈ డ్రెయినేజీ 13 కిలో మీటర్ల మేర ప్రవహిస్తుండగా, బీవీరాజు కళాశాల వద్ద నుంచి రాయలం వరకు అనేక చోట్ల రూ.కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతమైంది. ముఖ్యంగా భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డు నుంచి రాయలం వరకూ డ్రెయినేజీ రెండు వైపులా 10 నుంచి 15 అడుగుల మేర డ్రెయిన్ భూమిని ఆక్రమించి పక్కా నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. భీమవరం గాయత్రి ఆస్పత్రి సమీపం నుంచి రాయలం వరకు ఈ డ్రెయినేజీ భూమి చాలా విలువైనది. డ్రెయినేజీకి రెండు వైపులా కూడా భూమి విలువ రూ.కోట్లలో ధర ఉంటుంది. డ్రెయినేజీ వల్ల దుర్వాసన వస్తుందని సాకుగా చూపి భవనాలు, స్థలాల యజమానులు వారి పరపతిని ఉపయోగించి డ్రెయినేజీపై బాక్సు నిర్మాణం చేయించారు. ఇదే అదునుగా చేసుకుని వారి భూమి దాటి ముందుకు వచ్చి డ్రెయినేజీ మిగిలిన భాగాన్ని సైతం అక్రమించి పక్కా భవనాలు నిర్మించారు. ఖాళీ స్థలాలు ఉన్నవారు డ్రెయినేజీ స్థలంలో రేకులతో ప్రహరీలు తీస్తున్నారు.

డ్రెయిన్ ఆక్రమించి వ్యాపారాలు

భీమవరం పట్టణంలో రాయలం డ్రెయిన్‌కు రెండు వైపుల అక్రమించుకుని భవనాలు, ఇతర కట్టడాలు చేసి అక్రమణదారులు వ్యాపారాలు చేసుకుంటున్నారు. అక్రమణాలు తొలగించి ఈ క్లోజ్‌డ్ (బాక్స్ డ్రెయిన్)ను భీమవరం మున్సిపాలిటి పెయిడ్ పార్కింగ్‌కు ఉపయోగించుకుంటే మంచి ఆదాయం లభిస్తుంది. ఈ డ్రెయిన్ ఉన్న ప్రాంతాల్లో ఆస్పత్రులు, హోటల్స్ ఉండడంతో కార్లు పార్కింగ్ ఎంతో ఉపయోగపడుతుంది.

గతంలో చర్యలు

రాయలం డ్రెయిన్ అక్రమణాలకు గురైందని గత కలెక్టర్ ప్రశాంతి గుర్తించారు. డ్రెయినేజీ అధికారులకు అదేశాలు జారీ చేసి డ్రెయిన్ సర్వే చేయించారు. దాంతో అధికారులు డ్రెయిన్‌పైకి దాటి వచ్చిన కట్టడాలకు మార్కింగ్ కూడా చేశారు. ఆక్రమణల తొలగింపుపై కలెక్టర్ చర్యలు తీసుకోవడానికి సిద్ధమైన తరుణంలో ఎన్నికల పనులతో ఆమె బిజీగా మారడం, తర్వాత ఆమె బదిలీకావడంతో ఆక్రమణల తొలగింపు చర్యలు నిలిచిపోయాయి. ప్రస్తుత కలెక్టర్ నాగరాణి ఈ డ్రెయిన్ ఆక్రమణలపై దృష్టి పెట్టి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: ఉండి 220, 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి యండగండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం విలేకరులకు తెలిపారు. యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

14న భీమవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం: శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి, గన్నాబత్తుల పెదతాత కల్యాణ మండపం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు కాగిత వీఠి మహంకాళిరావు, మెంటే పార్థసారథి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నిత్యావసరాల దుకాణాలు ప్రారంభం


భీమవరంలో ఉల్లి,టమాటా విక్రయాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న వంట నూనెలు, టమాటా, ఉల్లిపాయల రేట్లు నియంత్రించడానికి ప్రభుత్వం తక్కువ ధరలకు వాటి విక్రయాన్ని చేపట్టినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం ఆర్‌టీబీ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌లో విక్రయకేంద్రాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)తో కలిసి ప్రారంభించారు. వినియోగదారులు ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు ద్వారా ఒక్కొక్క కిలో చొప్పున పొందవచ్చునన్నారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి శివ రామ ప్రసాద్, డీఎస్‌ఓ ఎన్.సరోజ పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానిక అయిభీమవరం టర్నింగ్ వద్ద తక్కువ ధరలకు నిత్యవసర వస్తువులను విక్రయించే ప్రభుత్వ స్టాల్‌ను ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజు గురువారం ప్రారంభించారు. అనంతరం జిల్లా పౌర సరఫరా శాఖఅధికారి సరోజిని మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఒకొక్క షాపును ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, డీటీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు ఘన నివాళి


భీమవరంలో మోటార్‌వర్కర్స్ ఆధ్వర్యంలో రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: భారతదేశ పారిశ్రామిక రంగ దిగ్గజం రతన్ టాటా చిత్రపటానికి భీమవరం మోటార్ వర్కర్స్ గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారిశెట్టి రాంప్రసాద్ మాట్లాడుతూ తన కంపెనీల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించి భారతదేశ పారిశ్రామిక రంగంలో అగ్రగామి సంస్థగా నిలిపారని కొనియాడారు. సంఘ సేవకుడు అల్లు శ్రీనివాస్, నాగరాజు, పామర్తి రాము, పైపూరి రాము, అందే కొండ, సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

భీమవరం: పారిశ్రామిక వేత్త రతన్ టాటా మరణంతో భారత్ విలువ కట్టలేని రత్నాన్ని కోల్పోయిందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోళ్ల నాగేశ్వరరావువు, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, విజ్జురోతి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి ఆసుపత్రిలో న్యాయవిజ్ఞాన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న న్యూటన్

భీమవరం: మానసిక వికలాంగుల పట్ల ఓర్పు, సహనంతో మెలగాలని వారిని హేళన చేస్తే చట్టం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి మానసిక ఆసుపత్రిలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మానసిక వికలాంగులకు మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామన్నారు. శాంతి మానసిక ఆసుపత్రి వైద్యుడు జీవీ రమణరావు మాట్లాడుతూ చిన్న పిల్లలను సెల్ ఫోన్స్, వీడియో గేమ్స్ నుంచి దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో పెంచాలని అంతేగాకుండా మానసిక ఒత్తిడికి గురిగాకుండా చూసుకోవాన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సుభాష్, జి.శ్రీవిద్య, సంస్థ ప్యానల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, డి.రవికిరణ్, బి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట జాబితా ప్రదర్శన


రైతు సేవా కేంద్రంలో రైతుల నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఖరీఫ్ సాగు చేస్తున్న రైతుల ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి కావడంతో జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక చెప్పారు. స్థానిక ఆర్ఎస్కే వద్ద ఈ-పంట నమోదు జాబితాను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పంట నమోదు, ఈ-కేవైసీ వేలిముద్రల సేకరణ పూర్తయ్యిదన్నారు. జాబితాలో ఉన్న రైతులు తమ పేర్లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, సెల్ నెంబర్‌లలో లోపాలుంటే తెలియజేయాలని ఆమె సూచించారు. ఈ నెల 16 లోపు ఆయా లోపాలను వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద గానీ, ఆర్ఎస్కే వద్ద గాని తెలియజేయాలన్నారు. లోపాలుంటే రైతు భరోసా, ఇతరత్రా పథకాలు బ్యాంక్ ఎకౌంట్‌లో జమ కావని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శ్రీనివాసరావు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన భూమిని కొనుగోలు చేయడం నేరం

పాలకోడేరు: గరగపర్రు ఎంపీటీసీ సభ్యుడు షేక్ పాపా సాహెబ్ (శంకరం ప్రజాప్రతినిధిగా ఉండి ప్రభుత్వ స్థలాలు, శ్మశాన స్థలాలను రక్షించాల్సింది పోయి కొనుగోలు చేశానని చెప్పడం నేరమని గరగపర్రు ఎస్సీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్మశాన భూమిని ఆక్రమించుకోవడం అన్యాయమన్నారు. భూమిలోకి వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా బయట వ్యక్తులను తీసుకువచ్చి రోడ్డుపై టెంటు వేసి గ్రామంలో అలజడి సృష్టించడానికి ప్రయత్నించారన్నారు. తాను కొనుగోలు చేశానని భూమికోసం మా సంఘానికి వచ్చి ఆ స్థలం కోసం ఎందుకు రాజీ ప్రయత్నాలు చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ భూమి అని బ్యానర్ పెట్టించి మళ్లీ ఆ భూమిని మీరే కొన్నామని చెప్పడం హాస్యస్పాదంగా ఉందన్నారు. రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శంకరంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వార్డు మెంబర్లు డొల్ల యోనా, ఏసేబు గొంతి చిన్ని, కె.ఏసు పాల్గొన్నారు.

కరుణించమ్మా..కనకదుర్గమ్మ


భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీదుర్గా దేవి అమ్మవారి అలంకరణలో మావుళ్లమ్మ


భీమవరం(ప్రకాశం చౌక్): దుర్గాదేవి అలంకరణలో ఆదిలక్ష్మీ అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ వారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా గురువారం మావుళ్లమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక నాచువారి సెంటర్‌లో నవదుర్గల అలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గునుపూడి గ్రామ దేవత శ్రీ ఆదిలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, పోలేరుమ్మ వారి ఆలయంలో దేవి నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారు విశేష పూజలు అందుకుంటున్నారు. భీమవరం పంచారామక్షేత్రంలో శ్రీదేవినవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో కొలువైన శ్రీపార్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ,పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం పార్వతీ దేవి అమ్మవారిని శ్రీదుర్గా దేవి అలంకరణ నిర్వహించి ప్రత్యేక కుంకుమ పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అలాగే ఈలంపూడికి చెందిన అల్లూరి రవికుమార్ రాజు లక్ష్మీ దంపతులు మావుల్లమకు 16 గ్రాముల బంగారం కానుకగా సమర్పించారు. దాతలను ఈఓ, అర్చకులు సత్కరించారు. భీమవరం మెంటే వారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గా శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో గురువారం మహాచండీ హోమం నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను, చండీపారాయణం, శ్రీసూక్త పారాయణం, మహా చండీ హోమం నిర్వహించారు.


భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారితోటలో మహాచండి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరులోని స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం శ్రీలక్ష్మీ శరన్నవరాత్ర మహోత్సవముల్లో భాగంగా గాయత్రీ అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చరు. అమ్మవారికి ఉదయం శ్రీ చక్ర అభిషేకం నిర్వహించారు. అలంకరణ దాతలు తాడినాడ వాస్తవ్యులు కుమాండూరి రవీంద్రనాథ్, మధులిక దంపతులచే సామూహిక సహస్రనామ కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉండిలో..

ఉండి: దసరా మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు కనకదుర్గమ్మ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి దుర్గాదేవిని భక్తులు దర్శంచుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉండి, మహదేవపట్నం, చెరుకువాడ, కోలమూరు, యండగండి తదితర ప్రాంతాల్లో పూజాకార్యక్రమాలను నిర్వహించారు. కుంకుమపూజ, సహస్రనామార్చన చేశారు. అలాగే ఉండిలో కనకదుర్గమ్మ యూత్ సభ్యులు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు కనకదుర్గమ్మ అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆకివీడు పెద్దింటి అమ్మవారికి ప్రత్యేక అలంకరించి మహిళలు కుంకుమ పూజలు చేశారు. స్థానిక వనువులమ్మ, రాజరాజేశ్వరి అమ్మవారు, మారెమ్మ, గంగానమ్మ, మద్దిరావమ్మ, అజ్జాలమ్మ, కనక దుర్గమ్మలకు ప్రత్యేక అలంకరణలు చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అజ్జాలమ్మకు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు.


ఆకివీడు: దుర్గమ్మ అలంకరణలో పెద్దింటి అమ్మ


కాళ్ల: గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


ఆకివీడు: దుర్గమ్మ అలంకరణలో వనువులమ్మ


ఉండి: దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కైనా నాటాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మొక్కలు నాటి పెంచడం ఇళ్లలోను తోటల్లోనూ కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పెంచాలని, మా తపాల శాఖ కార్యాలయంలో సమృద్ధిగా పెంచడానికి ప్రణాళిక చేశామని భీమవరం డివిజనల్ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అల్లు సురేష్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో భీమవరం పోస్టల్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించి వచ్చేవారికి మనం పెంచిన మొక్కలు పెద్దవై నీడనిస్తాయని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ, భీమవరం సౌజన్యంతో 27 పూల మొక్కలను తపాల శాఖ కార్యాలయంలో నాటారు. కార్యక్రమంలో హెడ్‌పోస్ట్ మాస్టర్ పి.రాజు, చెరుకువాడ రంగసాయి, రెడ్ క్రాస్ చైర్మన్ రామబద్రి రాజు, మల్లేశ్వరరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎంవీ రమణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం


వీరవాసరం: అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


భీమవరం(ప్రకాశం చౌక్): గునుపూడిలో మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీ కాంతం

వీరవాసరం: నందమూరి గరువు, మత్స్యపురిలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని గురువారం మండలంఓని అంగన్‌వాడీ సెంటర్‌లలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందు ఎంఎల్‌హెచ్‌పి.భారతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత గురించి, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే బి .సంధ్యారాణి, ఏఎన్ఎం వి.శ్రావణి, అంగన్వాడీ కార్యకర్త కె. బేబీ పాల్గొన్నారు.

తాడేరులో

భీమవరం: మండలంలోని తాడేరు గ్రామంలో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి మాట్లాడుతూ యుక్తవయస్సులోని బాలికలు వారి విలువ, బలం, సామర్థ్యాన్ని గుర్తించడానికి అదనపు అవకాశాలు సృష్టించడాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు కార్యక్రమంలో మహిళాపోలీసు జి.శాంతకుమారి పాల్గొన్నారు.

గునుపూడిలో..

భీమవరం(ప్రకాశం చౌక్): అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరం గునుపూడి అంగన్‌వాడీ సెంటర్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను,అనర్థాలను నివారించి వారి హక్కులను ఎలా కాపాడుకోవాలో? అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీఓ రాజేష్ పాల్గొన్నారు.